ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేదాక కాలేజీల బంద్

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తేతెలంగాణ)/రామగిరి : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేదాక కళాశాలలను నిరవధికంగా బంద్ చేస్తామని రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సూర్యనారాయణ,కార్యదర్శి యాద రామకృష్ణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడినల్లగొండ జిల్లాలో సోమవారం 76 కాలేజీలను తెరువలేదు. నల్లగొండలో అన్ని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలను బంద్ చేసి.. రామగిరిలోని నీలగిరి డిగ్రీ, పీజీ కళాశాల వద్ద నిరసన తెలిపాయి.

కాలేజీల బంద్ వద్దు : కృష్ణయ్య

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల రాలేదని యాజమాన్యాలు చేపట్టిన కాలేజీల బంద్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం తక్షణం బకాయిలను విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

తగ్గుతున్న విద్యార్థులు.. పెరుగుతున్న టీచర్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో పడిపోతున్న ఎన్‌రోల్ మెంట్
- విద్యార్థుల నమోదుపై దృష్టిపెట్టని పాఠశాల విద్యాశాఖ

ఎన్‌రోల్‌మెంట్ ఇలా..

సంవత్సరం	ఎన్‌రోల్ మెంట్	టీచర్లు	ప్రైవేట్‌లో..
2021-22	25,85,319	1.12లక్షలు	30,50,542
2022-23	23,35,952	1.12లక్షలు	33,87,369
2024-25	20,68,281	1.13లక్షలు	34,05, 444

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు బడుల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ క్రమేణా తగ్గుతున్నది. మూడేండ్లలో ఏకంగా 5 లక్షలకు పైగా విద్యార్థులు తగ్గారు. గతంలో 25 లక్షలుండగా, ఇప్పుడు 20 లక్షల మందే స్కూళ్లకు వెళ్తున్నారు. ఇందుకు భిన్నంగా టీచర్ల సంఖ్య మాత్రం ఏటా పెరుగుతున్నది. ఇదివరకు 1.12 లక్షల మంది టీచర్లుండగా, ఈ విద్యా సంవత్సరంలో 1.13 లక్షలకు చేరారు. తాజా డీఎస్సీ-2024లో భాగంగా దాదాపు 10 వేల టీచర్ పోస్టులను భర్తీచేశారు. డీఎస్సీ-2008 అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు ఇవ్వనుండడంతో మరో 1,450కి పైగా కొత్త టీచర్లు రానున్నారు. డీఎస్సీ-24లో పెండింగ్ 1,056 పోస్టులు సైతం భర్తీకానున్నాయి. ఇవన్నీ కలిపితే రాష్ట్రంలో మొత్తం టీచర్ల సంఖ్య 1.25 లక్షలకు చేరనున్నది. ఒకవైపు టీచర్ల సంఖ్య పెరుగుతుండ గా, మరోవైపు విద్యార్థుల సంఖ్య తగ్గుతుండటంతో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి పడిపోతున్నది. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి 1:30 ఉండాల్సి ఉండగా,డీఎస్సీ-2024, డీఎస్సీ-2008 నియామకాలు కలుపుకుంటే 1:10కి చేరనున్నది. అయితే విద్యార్థుల సంఖ్య నమోదుపై విద్యాశాఖ దృష్టి పెట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం బడిబాట మినహా నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్నది. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పాఠశాల విద్య తీవ్ర సంక్షోభంలోకి వెళ్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత జూన్‌లో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య 20.75 లక్షలు ఉండగా, సెప్టెంబర్ నాటికి 20.68 లక్షలకు పడిపోయింది. ఇదే జూన్‌లో ప్రైవేట్‌లో 33.87లక్షలు ఉండగా, సెప్టెంబర్ నాటికి 34.05 లక్షలకు పెరిగింది.

స్కూళ్లల్లో విద్యార్థులు, టీచర్ల పరిస్థితి..

- రాష్ట్రంలో 1,745 జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లుండగా, వీటిల్లో 1,617 మంది టీచర్లు పనిచేస్తుండగా, వీరిని ఇతర స్కూళ్లల్లో సర్దుబాటు చేశారు.
- ఒకే ఒక్క విద్యార్థి ఉన్న స్కూళ్లు 43 ఉంటే వీటిల్లో 51 మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఇద్దరు విద్యార్థులున్న స్కూళ్లు 88 ఉండగా వీటిల్లో 111 మంది టీచర్లున్నారు.
- ముగ్గురు విద్యార్థులున్న స్కూళ్లు 125 ఉంటే 166 మంది, నలుగురు విద్యార్థులున్న స్కూళ్లు 181 ఉంటే 248 మంది టీచర్లు పనిచేస్తున్నారు.
- ఐదుగురు విద్యార్థులున్న స్కూళ్లు 267 ఉంటే 351 మంది టీచర్లు, ఆరుగురు ఉన్న స్కూళ్లు 265 ఉండగా, 381 మంది టీచర్లు పనిచేస్తున్నారు.
- ఏడుగురు విద్యార్థులున్న స్కూళ్లు 281 ఉంటే 373 మంది టీచర్లు, 8 మంది ఉన్న స్కూళ్లు 317 ఉంటే 472 టీచర్లు పనిచేస్తున్నారు.
- తొమ్మిది మంది ఉన్నవి 323 స్కూళ్లు ఉంటే 448 మంది టీచర్లు, పది మంది ఉన్నవి 358 ఉంటే, వీటిల్లో 541 మంది టీచర్లు పనిచేస్తున్నారు.
- 1-10 మంది విద్యార్థులున్న స్కూళ్లు 3,993 ఉండగా 4,759 మంది టీచర్లు పనిచేస్తున్నారు.

కొత్త డీఎస్సీ కష్టమే..

పరిస్థితి ఇలా ఉంటే కొత్త డీఎస్సీ కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లో పాఠశాల విద్యాశాఖలో 25 వేల టీచర్ పోస్టులను భర్తీచేస్తామని హామీ ఇచ్చింది. వీటిలో తాజాగా భర్తీచేసిన 11వేలు మినహాయిస్తే మరో 14వేల పోస్టులను భర్తీచేయాల్సి ఉంది. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తక్కువగా ఉండటంతో రేషనలైజేషన్ చేయాలని కేంద్రం ఆదేశాలిస్తున్నది.ఈ నేపథ్యంలో కొత్త డీఎస్సీ ఎలా సాధ్యమన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద భక్తుల ఆందోళన

లష్కర్ ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం

- ఆలయంలో ఆగంతకుడి వీరంగం
- సీసీలో రికార్డు.. వీడియో వైరల్
- చితకబాది పోలీసులకు అప్పగించిన స్థానికులు
- నిందితుడు ముంబయికి చెందిన సలీంగా గుర్తింపు
- సికింద్రాబాద్‌లో పరిస్థితి ఉద్రిక్తం

బేగంపేట్ అక్టోబర్ 14 : సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంపై ఓ ఆగంతకుడు సోమవారం తెల్లవారుజామున దాడిచేసి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. కాళ్లతో తన్నుకుంటూ లోనికి వచ్చి అమ్మవారి విగ్రహాన్ని కాళ్లతో తన్నుతూ పడగొట్టాడు. ఆలయం గద్దెపైకి ఎక్కి మరింత ధ్వంసానికి పాల్పడుతుండగా స్థానికులు పట్టుకొని కొట్టి పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని మొదట గాంధీ దవాఖానకు, అటు నుంచి నిమ్స్‌కు తరలించారు. ఆ ఉన్మాది వీరంగమంతా సీసీ కెమెరాలో రికార్డు కాగా.. సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

మార్కెట్ ఠాణాలో కేసు నమోదు

ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం ఘటనపై మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. కుమ్మరిగూడకు చెందిన చెల్మెల కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదులో నిందితుడు గుర్తుతెలియని ముస్లింగా పేర్కొన్నారు.అతడిపై 333,331(4), 196,298, 299 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సికింద్రాబాద్‌లో ఉద్రిక్తత

నిందితుడు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్న వీడియోలు బయటకు రావడంతో సికింద్రాబాద్‌లో పోలీసులు పెద్ద సంఖ్యలో పహారా ఏర్పాటు చేశారు. నగర సీపీ సీవీ ఆనంద్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, బీజేపీ నాయకురాలు మాధవీలత వచ్చి స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనను నిరసిస్తూ స్థానికులు హిందూ సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు పెద్ద ఎత్తున్న వచ్చి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఆ ఆగంతకుడు అతడేనా!

ఆగంతకుడు ముంబయికి చెందిన సలీం సలాం ఠాకూర్ అని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ఇతడిపై ముంబయిలోనూ 2022లో గణేశ్ మండపంలో విగ్రహాల ధ్వంసం, ఈ ఏడాది ఆగస్టులో శివాలయంలో విగ్రహం ధ్వంసం చేసిన కేసులు నమోదయినట్టు సమాచారం.

నగర ప్రతిష్ఠకు మచ్చ

హైదరాబాద్/సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడి తీవ్ర కలకలం రేపుతున్నదని, ఇలాంటి తెలివి తక్కువ చర్యలు నగర ప్రతిష్ఠకు మచ్చలాంటివని, ఆగంతకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రోజురోజుకూ రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారుతున్నాయని,ఈ ఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడి ఆక్షేపణీయమని పేర్కొన్నారు. మూర్ఖపు చర్యలతో నగర ప్రతిష్ట దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తంచేశారు.

అత్యంత దారుణం : రాకేశ్‌రెడ్డి

ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన దాడి అత్యంత దారుణం, అనాగరికమని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

గురుకులాలను కుదించే కుట్ర

- రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఉంచుతున్నవా? ఊడగొడుతున్నవా?
- స్కూల్ బిల్డింగ్‌లు కడుతున్నరా? కొత్త స్కూల్స్ పెడుతున్నరా? : వినోద్

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డి చెప్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరుతో గురుకులాలను ఉంచుతున్నారా? ఊడగొడుతున్నారా? చెప్పాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ప్రశ్నించారు. రాష్ట్రంలో గురుకులాలను తగ్గిస్తున్నారా? కొత్త రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారా? స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి ఒకటని చెప్తున్న సీఎం, ఇప్పుడున్న 1,023 గురుకులాలను 119 చేస్తారా? లేక అదనంగా 119 గురుకులాలను ఏర్పాటు చేస్తున్నారా? చెప్పాలని నిలదీశారు. జీవో, ముఖ్యమంత్రి మాటలు, డీపీఆర్ పరస్పర విరుద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ గందరగోళంలో గురుకులాలను కుదించే కుట్ర ఏమైనా జరుగుతున్నదా? అనే అనుమానం వ్యక్తంచేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గురుకులాలను కుదిస్తే సహించే ప్రసక్తే లేదని, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. గురుకులాలతో కేసీఆర్‌కు మంచి పేరు వచ్చిందని, గురుకులాల్లో చదవిన పిల్లలకు ఐఐటీ, ఎయిమ్స్‌లో సీట్లు వచ్చాయని గుర్తుచేశారు. కేసీఆర్ పేరును తుడిచివేయడం ఎవరి తరం కాదని తేల్చిచెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు తుల ఉమ, గెల్లు శ్రీనివాస్ యాదవ్, పల్లె రవి కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కరోనా కాలపు వాహనాలకు ఇక్కట్లు

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేక రీరిజిస్ట్రేషన్‌లో ఇబ్బందులు

హైదరాబాద్, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): కరోనా సమయంలో కొనుగోలు చేసిన వాహనాలలో కొన్నింటికి హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు లేకపోవడంతో వాటి రీరిజిస్ట్రేషన్‌కు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాష్ట్రంలో 2019 నుంచి వాహనాలకు హెచ్ఎస్ఆర్పీని తప్పనిసరి చేశారు. 2021-23 మధ్య కాలంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5 లక్షల వాహనాలకు హెచ్ఎస్ఆర్పీని పొందటం ఇబ్బందిగా మారింది. దీం తో వాహన యజమానులు తమకు నచ్చిన నంబర్‌ప్లేట్లను వాహనాలకు బిగించుకున్నారు. ఆ వాహనాల రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్‌లో రికార్డు కాకపోవడంతో ఇప్పుడు ఆ వాహనాల కొనుగోలు, అమ్మకాలకు తీవ్ర ఇబ్బందులేర్పడుతున్నాయి. దీనిపై పాలనాపరమైన నిర్ణయం తీసుకొని.. దశలవారీగా 20 వేల నుంచి 30 వేల చొప్పున వాహనాలకు విముక్తి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఓ సీనియర్ రవాణాశాఖ అధికారి తెలిపారు.

స్పోకెన్ ఇంగ్లిష్ పేరిట 'ప్రత్యేక' కాస్లులు

- మతపరమైన అంశాల బోధన.. ప్రసంగాలు!
- ఆలయం దరిదాపుల్లోనే కోచింగ్ సెంటర్
- వివిధ రాష్ట్రాల నుంచి 140మంది రాక.. ఓ హోటల్‌లో ఆశ్రయం..

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో చోటు చేసుకుంటున్న నేర ఘటనల వెనుక నిఘా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం విధ్వంసంపై స్థానికులు ముందే హెచ్చరించినా పోలీసులు పట్టించుకోలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి కొత్తగా వచ్చిన వారు ఆలయ పరిసరాల్లో తిరుగుతున్నారంటూ స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు ఫిర్యాదులు చేసినా స్పందించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్పోకెన్ ఇంగ్లిష్ పేరుతో 140 మంది వివిధ రాష్ట్రాల నుంచి సికింద్రాబాద్ వచ్చి కొన్ని రోజులుగా బస చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల చొప్పున వసూలు చేసి ఆలయానికి సమీపంలోని హోటల్‌లో ఆశ్రయమిచ్చారు. వీళ్లందరికీ మోటివేషన్ క్లాసెస్ పేరుతో స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పడం, అందులో మతపరమైన అంశాలపై బోధించడంతో పాటు రెచ్చగొట్టే ప్రసంగాలు ఇస్తున్నారని, మతోన్మాదం వైపు రెచ్చగొట్టే కుట్ర జరుగుతున్నదన్న వాదనలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఎస్బీ, ఇంటెలిజెన్స్, టాస్క్‌ఫోర్స్ పోలీసులెవరూ కొత్తవాళ్లు ఎవరనేది తెలుసుకునే ప్రయత్నం చేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం ఘటన జరిగిన తర్వాత పోలీసులు ఆ హోటల్‌పై దాడిచేసి కొంత సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. నిందితుడు కూడా వీరిలో ఒకడు కావచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.9కే 25వేల ప్రమాద బీమా

- ఫోన్‌పే దీపావళి ఇన్సూరెన్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: దీపావళి సందర్భంగా ప్రముఖ డిజిటల్ పేమెంట్స్ యాప్ ఫోన్‌పే ఓ సరికొత్త ప్రమాద బీమాను పరిచయం చేసింది. బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్‌తో కలిసి కేవలం 9 రూపాయలకే



రూ.25వేల వరకు ఇన్సూరెన్స్ సదుపాయాన్ని ప్రకటించింది. పటాకులు కాల్చేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఈ కవరేజీ లభిస్తుంది. అయితే ఈ బీమా సౌకర్యం 10 రోజులు మాత్రమే ఉంటుంది. అది ఈ నెల 25 నుంచి మొదలవుతుంది. ఒకవేళ 25 తర్వాత పాలసీని తీసుకున్నట్టైతే ఆ తేదీ నుంచే మిగతా రోజులకు వర్తిస్తుంది. గాయాలపాలైతే దవాఖాన ఖర్చులు వస్తాయి. దురదృష్టవశాత్తు చనిపోయినా బీమా సొమ్మును క్లెయిం చేసుకోవచ్చు. కుటుంబంలో నలుగురికి ఈ పాలసీ కవరేజీ ఉంటుంది. పాలసీదారుడు, వారి భాగస్వామి, ఇద్దరు సంతానానికి బీమా భద్రత ఉంటుంది. ఫోన్‌పే యాప్ ద్వారా ఈ బీమా పాలసీని తీసుకోవచ్చు.

- తొలుత ఫోన్‌పే యాప్‌పై ఇన్సూరెన్స్ సెక్షన్‌ను ఎంచుకోవాలి. ఆ తర్వాత హోం పేజీ నుంచి ఫైర్‌క్రాకర్ ఇన్సూరెన్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
- మీ ప్లాన్ వివరాలు కనిపిస్తాయి. అందులో రూ.9 ఫిక్స్‌డ్ ప్రీమియంకు రూ.25,000దాకా బీమా కవరేజీ, ఇతరత్రా ప్రయోజనాలుంటాయి.
- పూర్తిగా పరిశీలించిన తర్వాత పాలసీదారు తమ వివరాలను ఇవ్వాలి. ఆపై 'ప్రొసీడ్ టు పే'పై క్లిక్‌చేసి ప్రక్రియను పూర్తి చేయవచ్చు.

రారెత్తిస్తున్న ధరలు

9 నెలల గరిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం
సెప్టెంబర్‌లో 5.49 శాతంగా నమోదు
టోకు ధరల సూచీ 1.84 శాతానికి
ఎంతకీ తగ్గని ఆహారోత్పత్తుల రేట్లు

కూరగాయల దెబ్బ

రిటైల్ ద్రవ్యోల్బణం ఇంతలా పెరిగిపోవడానికి కారణం ఎంతకీ దిగిరాని ఆహారోత్పత్తుల ధరలే. ముఖ్యంగా కూరగాయల రేట్లు తారా స్థాయిలోనే కదలాడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) వివరాల ప్రకారం ఆహార ద్రవ్యోల్బణం ఈ సెప్టెంబర్‌లో 9.24 శాతానికి ఎగిసింది. ఆగస్టులో 5.66 శాతమే. నిరుడు సెప్టెంబర్‌లోనూ 6.62 శాతంగానే ఉన్నది. కానీ ఈ దఫా భారీగా పెరిగిపోయింది. బహిరంగ మార్కెట్‌లో కిలో కూరగాయలు రకాన్నిబట్టి రూ.60 నుంచి 110 పలుకుతున్నాయి. టమాట రూ.100కు సమీపంలో కదలాడుతున్న సంగతి విదితమే. ఇక పప్పు ధాన్యాల ధరలూ ఎక్కువగానే ఉన్నాయి. కిలో రూ.100-150 పెట్టి కొన్నాలి వస్తున్నది. వంటనూనెల రేట్లూ కిలోకు రూ.20-40 మేర పెరిగిపోయాయి.

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: ధరలు రారెత్తిస్తున్నాయి. విజృంభిస్తున్న ద్రవ్యోల్బణంతో సామాన్యుడి జీవనం అస్తవ్యస్థమైపోతున్నది. గత నెల అటు రిటైల్, ఇటు టోకు ద్రవ్యోల్బణం రెండూ పెరిగాయి మరి. సెప్టెంబర్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత చిల్లర ద్రవ్యోల్బణం 9 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 5.49 శాతంగా నమోదైంది. గత ఏడాది డిసెంబర్ (5.69 శాతం) తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఇక అంతకుముందు నెల ఆగస్టులో ఇది 3.65 శాతంగానే ఉన్నది. కానీ నెల రోజుల్లో దాదాపు 2 శాతం ఎగిసింది. నిరుడు సెప్టెంబర్‌లో 5.02 శాతంగా ఉన్నది. ఈ మేరకు సోమవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక గణాంకాలు చెప్తున్నాయి.

హోల్‌సేల్ రేట్లూ పైపైకే..

హోల్‌సేల్ ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) కూడా పైపైకే వెళ్తున్నది. గత నెల 1.84 శాతంగా నమోదైంది. ఆహారోత్పత్తులు ప్రధానంగా కూరగాయల ప్రభావం దీనిపైనా కనిపించింది. ఆగస్టులో ఇది 1.31 శాతంగానే ఉన్నా.. నిరుడు సెప్టెంబర్‌లోనైతే మైనస్ 0.07 శాతంగా ఉండటం గమనార్హం. కాగా, దేశంలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు కూడా ద్రవ్యోల్బణం పెరుగుదలకు కారణమవుతున్నాయని ఎన్ఎస్ఓ చెప్తున్నది. అలాగే నిరుడు సెప్టెంబర్‌లో తక్కువగా ఉండటం వల్ల కూడా ఈసారి ఎక్కువైందనుకోవాల్సి వస్తున్నదని అంటున్నది.

వడ్డీరేట్ల కోత ఆశలు గల్లంతే

వచ్చే ద్రవ్యసమీక్షల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వడ్డీరేట్లను తగ్గిస్తుందనుకుంటే ఈ ద్రవ్యోల్బణం గణాంకాలు ఆ అంచనాలకు గండి కొట్టాయనిపిస్తున్నది. సుదీర్ఘ కాలం తర్వాత ఇటీవలి ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ తమ పాలసీ వైఖరిని మార్చుకున్న విషయం తెలిసిందే. ఇన్నాళ్లూ హాకిష్ పాలసీ (అధిక వడ్డీరేట్ల విధానం)ని అవలంభించిన సెంట్రల్ బ్యాంక్.. ఇకపై తటస్థ వైఖరి (న్యూట్రల్ పాలసీ)కి మారింది. దీంతో రెపోరేటు తగ్గుతుందన్న సంకేతాలు వచ్చాయి. అయితే ఇప్పుడు రిటైల్‌తోపాటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణాలు ఎగిసిపడటం ఈ ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. నిరుడు ఏప్రిల్ నుంచి రెపోరేటును 6.5 శాతం వద్దే ఆర్బీఐ కొనసాగిస్తున్నది. దీంతో వ్యక్తిగత, గృహ, వాహన తదితర రుణాలపై వడ్డీరేట్లు ఎక్కువగానే ఉంటున్నాయి. ఇది ఆయా రంగాల అమ్మకాలనూ ప్రభావితం చేస్తుండగా, దేశ ఆర్థిక వృద్ధినీ దెబ్బతీస్తున్నది. దీంతో వడ్డీరేట్లను తగ్గించాలన్న డిమాండ్లు వ్యాపార, పారిశ్రామిక వర్గాల నుంచి ఎక్కువైపోయాయి. మరి డిసెంబర్ ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ నిర్ణయం ఎలా? ఉంటుందో చూడాలి.

వాణిజ్య

బీవోబీ ఉత్సవ్ డిపాజిట్ స్కీం

ముంబై, అక్టోబర్ 14: బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ప్రత్యేక డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రకటించిన 400 రోజుల కాలపరిమితితో ఉత్సవ్ డిపాజిట్ స్కీంపై అధిక వడ్డీని ఆఫర్ చేస్తున్నట్టు బ్యాంకింగ్ వర్గాలు వెల్లడించాయి. ఈ డిపాజిట్లపై సాధారణ ప్రజలకు 7.30 శాతం వడ్డీని, సీనియర్ సిటిజన్లకు 7.80 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు(80 ఏండ్లకు పైబడిన వారు) 7.95 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. స్వల్పకాలం మాత్రమే అందుబాటులో ఉండనున్న ఈ డిపాజిట్ స్కీంలో రూ.3 కోట్ల వరకు డిపాజిట్ చేసుకోవచ్చును. 3-5 ఏండ్ల లోపు టర్మ్ డిపాజిట్లపై వడ్డీరేటును 6.50 శాతం నుంచి 6.80 శాతానికి సవరించింది.

ఐఎస్‌బీ @ 40 ర్యాంక్

హైదరాబాద్, అక్టోబర్ 14: ది ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) మరోసారి అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటింది. అంతర్జాతీయంగా ఉన్న బిజినెస్ స్కూళ్లలో ఐఎస్‌బీకి 40వ స్థానం లభించింది. ఫైనాన్షియల్ టైమ్స్(ఎఫ్‌టీ) ఇటీవల విడుదల చేసిన ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ర్యాంకింగ్ 2024లో ఈ విషయం వెల్లడించింది. ఈ జాబితాలో భారత్ నుంచి కేవలం ఐఎస్‌బీకి మాత్రమే చోటు లభించింది.

హెచ్‌సీఎల్ టెక్ లాభం 4,235 కోట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: హెచ్‌సీఎల్ టెక్నాలజీ ఆశాజనక ఆర్థిక ఫలితాలను అందుకున్నది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.4,235 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,832 కోట్ల లాభంతో పోలిస్తే 10.51 శాతం వృద్ధిని కనబరిచింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.26,672 కోట్లుగా ఉన్న సంస్థ ఆదాయం రూ.26,672 కోట్లకు ఎగబాకింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో, ఎండీ విజయకుమార్ మాట్లాడుతూ..డాటా, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఇంజినీరింగ్ వంటి టెక్నాలజీ సేవలకు డిమాండ్ అధికంగా ఉన్నదని, ఈ విభాగం నుంచి అధికంగా ఆర్డర్లు వస్తున్నాయన్నారు.

బీవైడీకి దిగుమతులే దిక్కు

ప్లాంట్ ఏర్పాటుకు దారిలేక రూటు మార్చిన చైనా ఈవీ సంస్థ

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: చైనాకు చెందిన ఈవీ కంపెనీ బీవైడీ.. భారతీయ మార్కెట్‌లో పట్టు సాధించేందుకు రూటు మార్చింది. బిలియన్ డాలర్ల పెట్టుబడితో దేశీయంగా ఓ ఉత్పాదక కేంద్రాన్ని పెట్టాలనుకున్నప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం అనుమతిని నిరాకరించింది. దీంతో ఇక దిగుమతులపైనే ఆధారపడి ఇక్కడ వ్యాపారాన్ని విస్తరించాలని నిర్ణయించుకున్నది. కొత్త ఈవీ పాలసీ కింద మోదీ సర్కారు బీవైడీ ప్లాంట్‌కు నో చెప్పిన విషయం తెలిసిందే. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మేఘా ఇంజినీరింగ్‌తో కలిసి ఈవీల తయారీ ఫ్యాక్టరీని తేవాలని బీవైడీ చూసిన సంగతి విదితమే. కానీ చైనాతో భారత్‌కున్న విభేదాలు, సరిహద్దు సమస్యల నడుమ లైన్ క్లియర్ అవ్వలేదు. కాగా, ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్న వాహనాలపై పెద్ద ఎత్తున దిగుమతి సుంకాలు పడుతున్నాయి. దీంతో విదేశీ కంపెనీల వాహనాల ధరలు దేశీయ మార్కెట్‌లో ఎక్కువైపోతున్నాయి. ఈ క్రమంలో భారత్‌లోనే ఈవీల తయారీకి బీవైడీ ముందుకొచ్చింది. ఇక్కడ ప్లాంట్ పెడితే అందులో తయారయ్యే వాహనాల ధరలు తగ్గుతాయని, మరింత పోటీనివ్వవచ్చని బీవైడీ భావించింది. కానీ పొరుగు దేశాలతో వాణిజ్యం విషయంలో కేంద్రం అనుసరిస్తున్న పాలసీతో కుదరలేదు.

మెరిసిన ఐటీ, బ్యాంకింగ్ షేర్లు

లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు ● సెన్సెక్స్ 592, నిఫ్టీ 164 పాయింట్లు వృద్ధి

ముంబై, అక్టోబర్ 14: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లు మదుపరులను ఆకట్టుకోవడం, అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడం కలిసొచ్చింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 591.69 పాయింట్లు లేదా 0.73 శాతం ఎగిసి 81,973.05 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 690.81 పాయింట్లు పుంజుకున్నది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా163.70 పాయింట్లు లేదా 0.66 శాతం ఎగబాకి 25,127.95 వద్ద నిలిచింది. టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఐటీసీ, ఇన్ఫోసిస్ షేర్లు భారీగా లాభాలను ఆర్జించాయి. ఈ క్రమంలోనే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.1.35 లక్షల కోట్లు పెరిగి రూ.4,63,62,781.71 కోట్లను తాకింది.

డీమార్ట్ షేర్లు ఢమాల్

ఈ జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికిగాను ఆర్థిక ఫలితాలు ఆశాజనకంగా లేకపోవడంతో రిటైల్ దిగ్గజం డీమార్ట్ మాతృ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్స్ షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈలో 8.48 శాతం పడిపోయి రూ.4,184.45 వద్ద, ఎన్ఎస్ఈలో 8.35 శాతం క్షీణించి రూ.4,191 వద్ద నిలిచాయి.

తగ్గనున్న విమాన చార్జీలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: ప్రస్తుత పండుగ సీజన్‌లో భారీగా పెరిగిన విమాన టికెట్ చార్జీలు దీపావళి నాటికి తగ్గే అవకాశాలున్నాయి. దివాళీ, ఛత్ పూజ నాటికి దేశవ్యాప్తంగా విమాన టికెట్ ధరలు గతేడాదితో పోలిస్తే 20-25 శాతం వరకు తగ్గనున్నాయని అంచనా ట్రావెల్ పోర్టల్ ఇక్సిగో అంచనావేస్తున్నది. సామర్థ్యాన్ని పెంచుకోవడం, ఇటీవలకాలంలో చమురు ధరలు దిగిరావడంతో విమాన చార్జీలు తగ్గించడానికి పలు విమానయాన సంస్థలు కసరత్తు చేస్తున్నాయని తెలిపింది. బెంగళూరు-కోల్‌కతాల మధ్య విమాన చార్జీలు సరాసరిగా 38 శాతం వరకు తగ్గనుండగా, చెన్నై-కోల్‌కతాల మధ్య 36 శాతం, ముంబై-ఢిల్లీల మధ్య 34 శాతం, ఢిల్లీ-కోల్‌కతా, హైదరాబాద్-ఢిల్లీల మధ్య టికెట్ ధరలు 32 శాతం వరకు తగ్గనున్నాయి.

నిరాశపరిచిన రిలయన్స్

క్యూ2లో 5 శాతం తగ్గిన ప్రాఫిట్
గండికొట్టిన చమురు, పెట్రో కెమికల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 14: ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబర్ త్రైమాసిక నికర లాభంలో 5 శాతం క్షీణించింది. ఆయిల్ రిఫైనింగ్, పెట్రో కెమికల్ వ్యాపారంలో ఆశించిన స్థాయిలో రాణించకపోకపోవడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.17,394 కోట్ల (ప్రతి షేరుకు రూ.25.71) నుంచి రూ.16,563 కోట్ల (ప్రతిషేరుకు రూ.24.48)కి పడిపోయింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం స్వల్పంగా పెరిగి రూ.2.38 లక్షల కోట్ల నుంచి రూ.2.4 లక్షల కోట్లకు చేరుకున్నది. రిటైల్, టెలికం రంగాలు నిలకడైన పనితీరు కనబరిచినప్పటికీ చమురు నుంచి టెలికం వర్టికల్ మాత్రం నిరాశాజనక పనితీరు కనబరిచాయని రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ తెలిపారు. క్రూడాయిల్, శుద్ధిచేసిన పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాలపై ప్రతికూల ప్రభావం చూపాయన్నారు.

- కంపెనీ రుణాలు రూ.2.95 లక్షల కోట్ల నుంచి రూ.3.36 లక్షల కోట్లకు చేరుకున్నాయి. జూన్ త్రైమాసికంలో ఇవి రూ.3.04 లక్షల కోట్లుగా ఉన్నాయి.
- ప్రస్తుతం సంస్థ వద్ద రూ.1.16 లక్షల కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి.
- రిటైల్ విభాగం రూ.68,937 కోట్ల ఆదాయంపై రూ.2,836 కోట్ల లాభాన్ని గడించింది. గత త్రైమాసికంలో కొత్తగా 464 స్టోర్లను ప్రారంభించడంతో మొత్తం అవుట్‌లెట్ల సంఖ్య 18,946కి చేరుకున్నాయి.

లాభాల్లో జియో జోరు

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో లాభాల జోరు కొనసాగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.6,539 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 23.4 శాతం వృద్ధిని కనబరిచింది. సరాసరిగా ఒక్కో కస్టమర్‌పై వచ్చే ఆదాయం రూ.181.7 నుంచి రూ.195.1కి చేరుకోవడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 18 శాతం ఎగబాకి రూ.31,709 కోట్లకు చేరుకున్నది. టారిఫ్ ధరలు పెరగడం సంస్థకు కలిసొచ్చింది. రెండేండ్ల క్రితం సంస్థ ప్రారంభించిన 5జీ సేవలకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని, ప్రస్తుతం 14.8 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రస్తుతం జియోకు 47.8 కోట్ల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. తొలి త్రైమాసికంలో ఉన్న 48.97 కోట్ల మందితో పోలిస్తే తగ్గగా, ఏడాది క్రితం ఉన్నవారితో పోలిస్తే భారీగా పెరిగారు.